# ఆశ్చర్యం!

* రచన : శ్రీ జి. వి. ప్రసాద్, *

విస్సుగాడు తమనివాసంయొక్క తలుపుని మెల్లగా స్టయిల్ అతిశయించునట్లుగా మునివేళ్ళతో తట్టేడు.

జవాబు శూన్యం!

ఇకలాభంలేదనుకున్నాడు.

ఒళ్ళతోపు ఘట్టిగా త్రోసాడు తన యావచ్ఛక్తిని ఉపయోగించి, ఈ దెబ్బలో విస్సుగాడిబలపరాక్రమశౌర్యాదిగుణాలు వారికి అంటే ప్రస్తుతం ఆ హాలు వంటగదిలాంటి కొట్టులో ఉన్న ఆ రెండుగ్రహాలకీ తెలిసి, రావాలనాకున్నాడు. వెంటనే తనకొక-చిన్న, హాట్! చిన్నదేం ఖర్మ! ఒహపెద్ద చాంతాడంత బిరుదు వాళ్ళిస్తారనుకున్నాడు. అప్పుడే వాళ్ళకి రాకపోతే ఫలానా బిరుదు ఉంది, అదికాస్తా నాకు పారేయండి అని ఓచిన్న ఫోజువిసిరి ఈక్రింది సమాసంలాంటిదేదో విసురుదామనుకున్నాడు విస్సు. "సింహకిశోరకంఠీరవశార్దూలమృగరాజుకరితుల్య బలసంపన్న ప్రళయకాలదిజృంభ అరిభయంకరుడ"నే ఒహ సమాసం తయారుచేసుకున్నాడు. ఇందులో కొన్ని, కొన్నేమిటి అన్నీ తప్పులున్నా, యింతకంటే ఎవరుబాగా రాస్తారనుకున్నాడు. ఇంకా ఛాలా ఛాలా అనుకున్నాడు.

విస్సుగాడుత్రోసిన తలుపులు కాస్తా తెరిచే ఉన్నాయేమో, ఎదురుగుండా కుర్చీమీద కూర్చొని నవ్వుతున్న సత్తిగాడు ఉరఫ్ అపరదూర్వాసుడిమీద పడబోయి తమాయించుకొని ఆప్రక్కనే మరో కుర్చీ ఉందనుకొని దానిమీద కూర్చోపోయాడు. పాపం "అక్కడ ఉన్న కుర్చీకి బదులు సూరిగాడు అక్కడ పడుకున్నాడు" అనేవిషయం విస్సుగాడికేం తెలుసు! ధభీమంటూ 'గుర్ గుర్'మని ఓచిన్న శబ్దం ప్రొడ్యూస్ చేస్తూ 'స్లీఫ్' పోతున్న సూరిమీద కూలబడ్డాడు. పుణ్యం (పాపం?) సూరిగాడు తనకలలో హీరోయిన్‌ని రక్షించడానికి రాక్షసుడితో యుద్ధంచేస్తూ రాక్షసుడు నిజంగానే రెండు తగిలించాడనుకొని పెంకులెగిరిపోయేలా ఓ చిన్న (పెద్ద!)గావుకేక పెట్టాడు.

ఈకేకలో బెదరిపోయిన హరికేశుణ్ణై(?)ఎదురుగ్గా ఉన్నగోడకి వెళ్ళిగుద్దుకున్నాడు. ముక్కు దెబ్బతినింది తల బొప్పికట్టింది! అట్టే మాట్లాడితే. ముక్కు మొహం ఏకమై ఏభాగమేదో తెలియలేదు చీనావాడిమొహంలా!

ఇంతలో మీదనుంచి కొంత ధూళిలాంటి పదార్థమేదో రాలింది గదంతా అర (సెంటి) మీటరు మందాన్న. ఈ ధూళి సూరిగాడి కేకవల్లె రాలిందన్నా ఆశ్చర్యపడాల్సింది పరమాణు మాత్రంకూడా లేదు. అక్కడే విస్సు కూలబడిపోయేడంటే వాడి తప్పేం కనిపించదుమరి!

మరోహ ఎనిమిది ముప్పావు సెకండ్లలో ఒక తారాజువ్వ, ఒక నిప్పుగొట్టాం విస్సుగాడి మీదికి దాడిచేసేయ్!

"ఏంరా! బుచ్చులూ! కుర్చీ, బెంచీ, టేబిలు, నేను, కొట్టూ, పెంకులు, దుమ్మూ, ధూళీ కన్నూ, మిన్నూ, ఏమీ కానరావటంలేదా? అంటూ మధ్య మధ్య తప్పు దొర్లిస్తూ ఒహ పెద్ద జాబితా వల్లించేడు సత్తిగాడు.

'నీకు వడ్డీ (అసలు?) పొగరు, మదం, మత్తు, గర్వం, (గట్రా?) ఎక్కువయ్యాయ్! మనుషుల్ని చూడలేనంత (దీని!) గానీ కళ్ళు నెత్తికెక్కాయా? (వాసన నూనచే) ఆకర్షింపబడి వాడి కళ్ళు జుత్తు మీదకి వెళ్ళిపోయేమోనన్న (అ) ధర్మ సందేహం సూరిగాడికి కలగకపోలేదు!) నేను ఛస్తే ఏంచేద్దామనుకున్నావ్‌రా గాడిదా! ఈ మాటన్నప్పుడు విస్సుగాడు తను ఛస్తే ఏట్లో కలిపేస్తానని అంటాడేమోనని భయం వేసింది సూ(బూ!)రికి.

'ఒరేయ్ గాడిదా! నిన్నే'

'ఉరేవ్ పంది!'

'ఓరి ఖడ్గ(మృగ విశేషం) మా!'

'ఉరే కుక్కా!'

ఇంకా ఇంకా పిల్లి, ఎలుకా, మేకా, నక్కా, ఉడుతా, తొండా, గట్రా అందామనుకొని మానేశాడు వాడు భళ్ళున (భోరున) ఏడుస్తాడని దయతల్చి!

వీళ్ళిద్దరూ యింత (ఇది!)గా తిడుతున్నా విస్సుగాడు పలకకుండా ఉండడానికి కారణం? అదే అంతుపడక సూరి, సత్తూ యిద్దరూ బుర్రలు బద్దలు కొట్టు (కోలేదు) కున్నారు!

వాడు ఛఛ్ఛాదేమోనని అనుమానంలాంటి వెధవ సందేహం ఓటి కలిగింది వాళ్ళకి. సూరిగాడికి భయం వేసింది.

విస్సుగాడు పలకలేదు!

ఉలకలేదు!

అలకలేదు!

కులకలేదు

కదలేదు! మెదలేదు!!

'ఉరేయ్! వాడేమయ్యాడో కాస ముఖంమీద నీళ్ళు జల్లి చూడరా! వెధవ ఏమయ్యాడో! వెర్రినాగన్న, బ్రతికినంతకాలం మారాజులా బతిగాడు.' అని ఎలాగో

నోరు పెగుల్చుకొని, విస్సుగాడు చచ్చినట్టే భావిస్తూ, సానుభూతి ప్రకటించేసేడు. మళ్ళా ముసుగు తన్నేయ బోయాడు సూరి. 'ఒరేయ్! ఆగరా! ఆగు!' అంటూ ముసుగుకాస్తా లాగిపారేసి 'కన్నలూ! నేనేం వాడి క్రిందా, నీక్రిందా, అందరిక్రిందా (నాక్రిందాఅనబోయి నా లిక్కరచుకున్నాడు) బంట్రోతుననుకున్నావా? కూలి వాడననుకున్నావా? ప్యూననుకున్నావా? అసలింతకీ నువ్వు నాకు జీతం ఇస్తున్నావా? బత్తెం యిస్తున్నావా? ఇంక్రిమెంటు(లు) యిస్తున్నావా? బోనసు(లు) యిస్తున్నావా? చెప్పరా! చెప్పు!' అంటూ యింకా ఏమేమో అందామనుకున్నాడు.

ఆఖరిమాట వినిపించిన సూరిగాడు చెప్పిందుకా అని ఆశ్చర్యపోతూ, ముందుగా తనదుప్పటిని వెనక్కిలాక్కున్నాడు. (సత్తిగాడు కళ్ళవెంట అగ్నికణాలు రాల్చాడేమోనని భయంవేసి.)

సూరిగాడి ముఖంలో ఏవీ రంగులు మారకపోవటం చూసి సత్తుగాడు అనుమానపడ్డాడు. తాను చెప్పినది విన లేదేమోనని, ఆ సందేహ నివృత్తికోసం అడిగేశాడు. 'నేచెప్పిందంతా విన్నావా? అంటున్నాను.''

ఆ...ఆ...వింటున్నాను. చెప్పేదెందుకో అర్థం కావటంలేదు అన్నాడు సూరి.

ఇంతసేపు తను చెప్పినదంతా బూడిదలోపోసిన పన్నీరు, అరణ్యరోదన, అడవిగాచిన వెన్నెల... యిలాంటి వాన్నిఅయిపోయాయని ఖేద పడ్డాడు.

మరొక అరనిమిషం యిద్దరూ మనస్సులో మథనపడి, పోనీ అభాగ్యుడు, ప్రమాదమందున్నవాడు, క్షతగాత్రుడు అసమర్థుడు అని తలచి వాడి దగ్గరకి వెళ్ళాడు. వాడి ముఖం అంటే విస్సగాడి ముఖం తన తొడమీద పెట్టుకొని సత్తుగాడు 'కొంచం నీళ్ళు తేరా'. అన్నాడు.

సూరికి అసలే కాళ్ళు వణుకుతున్నాయి. ఎలాగో ధైర్యం తెచ్చుకొని కూజాదగ్గరకు వెళ్ళి గ్లాసులోకి నీళ్ళు వంచబోయాడు. గ్లాసునిండా నీళ్ళు నిండిపోయి, కూజా ఒక్కసారిగా భళ్ళుమంది. వెంటనే ఒక్క దుముకు దుమికేడుసత్తు సూరిమీదికి. సత్తుగాడు దుమకడంతో వాడి తొడమీదున్న విస్సుతల నేలపైపడి 'టప్పే' మంది. దాంతో విస్సుగాడికి 'టఫీ'మని తెలివొచ్చేసింది.

ఇప్పుడీనీళ్ళంతా ఎవడు తుడుస్తాడనుకున్నావురా వెధవా! అంటూ సూరిగాడి పిట్ట పట్టుకోపోయిన సత్తుగాడు విస్సుగాడికి తెలివొచ్చిందని తెలిసి సంతోషించడంలాంటిదేదో చేశాడు.

అప్పుడే తెలివొచ్చిన విస్సుగాడు బ్రద్ద[illegible]గా, సత్తుగాడు సూరిగాడి ఫిట్టు పట్టుకోనే సన్నివేశం మొదలయినదన్నిచూచి బ్రహ్మాండమైన సస్పెన్సులో పడిపోయాడు.

ఒరేయ్ డబ్బీ! నీకు తెలివి ఎవరు తెప్పించారో తెలుసా? నేనురా... నేను అన్నాడు ఒగరుస్తూ సత్తు.

'ఇదంతా ఘోరమయిన అబద్ధం!' అరిచేడు సూరి.

'అసలేంజరిగిందంటే...' మొదలెట్టబోయాడు సూరి.

'సంతోషించేం.' అంటూ మధ్యలో తెగగొట్టేశాడు సత్తు సూరిగాడి మాటల్ని.

◆ ◆ ◆

ఆరోజు సూరి, సత్తు, విస్సు ముగ్గురూ రూంలోనే ఉన్నారు.

సత్తు, సూరి ఏదో పుస్తకాలు చదివేస్తున్నారు ధడా మడా!

సూరి డ్రమెటిక్ అసోసియేషన్ సెక్రెటరీగా నిలబడతామని కృతనిశ్చయుడైయున్నాడు. కాబట్టి తన నటసాకౌశలం నిరూపించుకొని ఓట్లు సంపాదించాలని ఓచిన్న ఏకపాత్రాభినయాన్ని ఆ మర్నాడు స్టేజిమీద ఆడేయడానికి, ఆ ఏక పాత్రాభినయం తాలూకు రిహార్సలు వేసుకోడానికి రడీగావున్నాడు. కాని మళ్ళా, నిద్రపోయివేసుకుంటే బాగుంటుదనుకున్నాడు. సత్తు ఆ పుస్తకం చదువుతూ నోట్లో రుమాల్లాంటిదేదో కుక్కుకొని, ఒకొక్కప్పుడు పగలబడి నవ్వేస్తూ, మరొకప్పుడు చిన్నచప్పుడు సన్నని స్వరంతో (కుతుక్ కుతుక్)మని శబ్దంచేస్తూ ఏడాపెడా 'లా'గేస్తున్నాడు.

పాపం విస్సుగాడు ఒకానొక పిశాచభరితమైన కథని చదువుతూ మరో పదకొండున్నర నిమిషాలో ఏడ్చేయడానికి సిద్ధంగా ఉన్న మూడ్‌లో ఉన్నాడు. ఆ కథలోని హీరోయిన్‌ని విలన్ పెడుతున్న కష్టాలకు వాడి హృదయకుండ (భాండం?) ఎప్పుడో బ్రద్దలయిపోయింది.

ప్రస్తుతానికి గదిలో (భయంకర!) నిశ్శబ్దం ఆవరించింది.

కొన్నిమినిట్లుగడిచేయి.

సత్తుసూరి తమ తమ కథల్ని (చదవడం) ముగించేరు.

ఒరేయ్ బస్సూ! ఇల్లీ కథ చదివేవా? (సశేషం)